క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్రకు ఏర్పాట్లు చేయాలి



కరపలో ఆడుదాం ఆంధ్ర, కులగణన సర్వేపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ

కరప: ఆడుదాం ఆంధ్ర క్రీడలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులతో సమీక్షించి పలు సూచనలిచ్చారు. గ్రామ, మండలస్థాయిలో ఈ పోటీలను నిర్వహించి, ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి, నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీలకు సమాయత్త పరచాలన్నారు. గ్రామాల్లో నిర్వహించనున్న కులగణన సర్వేపై కూడా ప్రత్యేక శ్రద్ధపెట్టి, నిబంధనల మేరకు సమగ్రంగా సర్వే చేయించి, యాప్‌లో నమోదు చేయించాలన్నారు. పంచాయతీ యాప్, ఇంటిపన్నులు వసూళ్లు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, నగదు రహిత లావాదేవీలు తదితర శాఖాపరమైన కార్యకలాపాలపై చర్చించి, అనుసరించాల్సిన విధివిధానాలపై ఎంపీడీఓ అప్పారావు సూచించారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, వి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ అందజేత

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రానికి కొప్పిశెట్టి నైనిక గురువారం కుట్టు మెషీన్ అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సువర్ణరాజు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఈ శిక్షణ దోహదం చేస్తుందని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమం చేపట్టారని చైర్మన్ రత్న ప్రసాద్‌ను అభినందించారు. రెడ్నం రాజా, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు

కరప: పంచాయతీ పరిధిలో ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఇళ్లుకానీ, ప్రహరీలుకానీ, కమర్షియల్ భవన నిర్మాణాలు కానీ చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ హెచ్చరించారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో అనధికార నిర్మాణాలు చేపడుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, అందుకే గ్రామంలో దండోరా ద్వారా, కరపత్రాల ద్వారా హెచ్చరికలు జారీచేస్తున్నట్టు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే బాధ్యులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడమే కాకుండా, సదరు కట్టడాలను తొలగించి, అందుకయ్యే ఖర్చులు కూడా వసూలు చేస్తామని కార్యదర్శి హెచ్చరించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్ పాల్గొన్నారు.

విశ్రాంతి గది పునఃప్రారంభం



విశ్రాంతి గదిని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈవో రమణారెడ్డి

కాకినాడ సిటీ: జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆధునీకరించిన నాలుగో తరగతి విశ్రాంతి గదిని జిల్లా పరిషత్ సీఈవో ఎ.రమణారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రిత్వ సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వీవీ రమేష్, జిల్లా పరిషత్ వివిధ విభాగాల పరిపాలనాధికారులు, నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ నగర అధ్యక్షుడు పాక నాగబాబు, సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిరసన హక్కును కాపాడాలి

కాకినాడ సిటీ: రాజ్యాంగం కల్పించిన నిరసన తెలియజేసే హక్కును కాకినాడ కలెక్టరేట్ వద్ద కొనసాగించాలని కోరుతూ కాకినాడ అఖిలపక్ష నాయకులు గురువారం జేసీ ఇలక్కియను కలసి వినతి పత్రం అందజేశారు. ర్యాలీలు, ధర్నాలు నిషేధిస్తూ వచ్చిన జీవోను రాష్ట్ర హైకోర్టు కొట్టివేసిన తర్వాత కూడా కలెక్టరేట్ వద్ద నిషేధ ఉత్తర్వులను అనధికారికంగా అమలు చేస్తూ ప్రజా సంఘాల నాయకులను, రాజకీయ పార్టీల నాయకులను నిర్బంధిస్తున్నారని వివరించారు. అఖిలపక్షం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, పప్పు ఆదినారాయణ, నరాల శివ, పిట్టా వరప్రసాద్, రాయుడు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఎస్ఎఫ్ఐ మహాసభలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను గురువారం జేఎన్టీయూకే వీసీ చాంబర్‌లో ఆవిష్కరించారు. డిసెంబర్ 27 నుంచి 29 వరకూ కాకినాడ దంటు కళాక్షేత్రంలో నిర్వహించే సభల పోస్టర్‌ను ఆహ్వాన సంఘ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, సంఘ అధ్యక్షుడు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ ఏర్పడిన 53 ఏళ్ల చరిత్రలో కాకినాడలో మొదటి సారి మహసభలు నిర్వహించడం సంతోషమని, వీటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.రాజా, వై.భాస్కర్ పాల్గొన్నారు.

సామాజిక స్థలాలు సార్థకం

- వృథాగా ఉన్న భూములకు విలువ
- పార్కులతో సుందరీకరణ
- ఉదయ, సాయం సంధ్యల్లో వాకింగ్‌కు అనువుగా ట్రాక్‌లు



కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలో చెరువు అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు



కాకినాడ రూరల్ రమణయ్యపేట టీచర్స్ కాలనీలో విశాలమైన స్థలంలో అభివృద్ధి చెందుతున్న పార్కు

కాకినాడ రూరల్: విలువైన సామాజిక స్థలాలు పల్లె ప్రజలకు ఆటవిడుపును ఇచ్చేలా అందమైన పార్కులుగా రూపుదిద్దుకుంటున్నాయి. పట్టణాన్ని తలపింజేసేలా మండలంలో నాలుగు పార్కులు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. సాయం సంధ్యలో సరదాగా కాలక్షేపం కోసం వచ్చే వారికి విలాసంగా అందంగా రూపుతున్న పార్కులు స్వాగతం పలికేలా ముస్తాబు చేస్తున్నారు. పల్లెల్లో వాకింగ్ చేసేందుకు రోడ్లు ఆధారం కాగా ఆ సమస్య తీరేలా తమ ప్రాంతంలోనే వాకింగ్ ట్రాక్‌లు ముస్తాబవుతున్నాయి. చిన్నారులకు ఆట విడుపుకు సిద్ధమవుతున్నాయి. స్మార్ట్ సిటీలో ప్రతి కాలనీలో పార్కులు, ఓపెన్ జిమ్‌లు అలరిస్తుండడంతో పల్లెల్లో ఖాళీగా పిచ్చి తుప్పలతో నిండిపోయి ఉన్న సామాజిక స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. రాయుడుపాలెం టీచర్స్ కాలనీలోని పార్కును ఇటీవల ఎమ్మెల్యే ప్రారంభించి, అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. వలసపాకలలో కేంద్రీయ విద్యాలయాన్ని ఆనుకుని ఒక పార్కును, వాకలపూడిలో ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న చెరువు అభివృద్ధి పనులను, రమణయ్యపేట బాపన్నదొర కాలనీలో పార్కు పనులను చురుగ్గా అభివృద్ధి చేస్తున్నారు.

ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో..



మండలంలో పార్కుల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. సామాజిక స్థలాలను వృథాగా కాకుండా సద్వినియోగమయ్యేలా పార్కుల ఏర్పాటుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవ తీసుకుని నిధులు సమకూర్చారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వీటిని వినియోగించుకునేందుకు చక్కటి అవకాశం లభించనుంది. మా గ్రామం వలసపాకలలో విశాలమైన ఖాళీ స్థలం ఇప్పుడు చాలా మందికి ఆరోగ్య ప్రదాయినిగా మారనుంది. వాకింగ్ ట్రాక్‌తో చాలా మంది రోజూ ఉదయం, సాయంత్రం పూట నడిచేందుకు, రన్నింగ్ చేసేందుకు వీలుగా ఉంది. – నురుకుర్తి రామకృష్ణ, జెడ్పీటీసీ, కాకినాడ రూరల్

వేగంగా పార్కులు నిర్మాణ పనులు



మండలంలో నాలుగు చోట్ల పార్కులు నిర్మాణంలో ఉన్నాయి. వాకింగ్ ట్రాక్‌లు, ప్రహరీ గోడలు నిర్మించాం. పూర్తి మౌలిక సదుపాయాల కోసం అదనంగా నిధులు తీసుకువస్తామని పనుల్లో రాజీ వద్దని ఎమ్మెల్యే కన్నబాబు సూచనలతో ముందుకు సాగుతున్నాం. – వాసుదేవరావు, పీఆర్ మండల ఇంజినీరు

స్మార్ట్‌సిటీ పనులు వేగవంతం చేయండి

బోట్‌క్లబ్: వివిధ దశల్లో ఉన్న స్మార్ట్‌సిటీ పనులన్నీ వేగవంతం చేయాలని నగరపాలసంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురువారం అధికారులతో సమావేశం నిర్వహించారు. కన్వర్టబుల్ స్టేడియం, సైన్స్ సెంటర్, కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్ పనులను వేగవంతంగా పూర్తి చేసి సాధ్యమైనంత త్వరలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి



పదోన్నతిపై వెళ్తున్న కృష్ణవేణిని సత్కరిస్తున్న సమాచారశాఖ సిబ్బంది

కాకినాడ సిటీ: సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది విజయవాడ బదిలీపై వెళుతున్న స్థానిక డీపీఆర్వో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.కృష్ణవేణిని సమాచార శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అందుకోవాలని డీడీ ఆకాంక్షించారు. సమాచార శాఖ అధికారులు ఏఈఐఈ సి.బాబూరావు, డీపీఆర్వో పి.రవి, ఏపీఆర్వో ఎస్ అజయ్, ఏఐఈ పీఆర్ఎస్ సిద్ధాంతి, సిబ్బంది పాల్గొని కృష్ణవేణిని సత్కరించారు.

లారీ కార్మికులకు పింఛను పెంపు



లారీ వర్కర్స్‌కు పింఛన్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు రాజు

కాకినాడ సిటీ: లారీ వర్కర్స్ యూనియన్‌లో పదవీ విరమణ చేసిన సభ్యులతో పాటు కాళ్లు, చేయి దెబ్బ తిన్న కార్మికులకు ఇచ్చే రూ.500 పింఛన్ పెంచి రూ.1000 ఇవ్వనున్నట్టు ది కాకినాడ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్ఎస్ రాజు తెలిపారు. కాకినాడ సంజయ్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో సాయిబాబా పూజ చేశారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు ఆధ్వర్యంలో జరిగిన పూజలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎం ప్రతాప్‌కుమార్, కోశాధికారి రామచంద్రరావు పాల్గొన్నారు. అనంతరం 30 మంది విశ్రాంత, కాళ్లు, చేతులు దెబ్బ తిన్న కార్మికులకు రూ.వెయ్యి పింఛన్లను యూనియన్ అధ్యక్షులు ఎస్ఎస్ రాజు కార్యవర్గ సభ్యులతో కలసి అందజేశారు. వచ్చే జనవరి నుంచి పింఛనర్ల ఇంటి వద్దనే పింఛన్ అందించనున్నట్టు రాజు వివరించారు. యూనియన్ నాయకులు చిక్కాల సుధాకర్, కొవ్వూరి సుధాకర్‌రెడ్డి, వరిపల్లి శివనారాయణ, సాగి శివరామ రాజు, వీరబాబు, లారీ ఓనర్స్, వర్కర్స్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధిని వివరించేందుకే..

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఎస్.అచ్యుతాపురంలో గడప గడపకూ



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కాకినాడ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ అర్బన్ 47వ డివిజన్ ఎస్.అచ్యుతాపురంలో గురువారం నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులతో ఇంటింటికీ పర్యటించి ఆయా కుటుంబాల వారు అందుకున్న పథకాలను వివరించారు. అదే సమయంలో వారు చెప్పిన సమస్యలను విన్నారు. ఎస్సీ పేట వాసులు ఇళ్ల పట్టాల సమస్య వివరించడంతో వాటిని త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ పేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. 47వ డివిజన్ పరిధిలో డ్రైనేజీలు పూర్తి స్థాయిలో నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్ రాజారపు వెంకటలక్ష్మి, కృష్ణ, సుంకర సాగర్, టీపీఆర్వో కృష్ణమోహన్, డీఈ వెంకట్రావు, ఏఈ రమేష్, స్థానిక నాయకులు తాతపూడి మూర్తి, పలివెల విజయ్‌కుమార్, సుబ్బారావు, కోటయ్య, వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కడియాల చిన్నా, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీను, దుర్గా ప్రసాద్‌రెడ్డి, చిల్లి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఖోఖో జట్ల పయనం



జాతీయ ఖోఖో పోటీలకు హాజరవుతున్న రాష్ట్ర బాలికల జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ నెల 3 నుంచి 7 వరకు జరిగే జాతీయస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 పోటీలకు రాష్ట్ర జట్లు గురువారం పయనమయ్యాయి. జేఎన్టీయూకేలో పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ సమకూర్చిన క్రీడా దుస్తులను క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ దుస్తులను జేఎన్టీయూకే పీడీ జి.శ్యాంకుమార్, ఖోఖో సంఘ కార్యదర్శి, పీడీ పట్టాభి అందజేశారు. ఎస్‌జీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ బాలికల జట్టుకు కెప్టెన్‌గా జిల్లాకు చెందిన నందిని, కోచ్‌గా భైరవపాలెం పీడీ ఎస్కే మహబూబ్ బాషా, మేనేజర్‌గా వి.కొత్తూరు పీడీ సీహెచ్ లోవలక్ష్మి, బాలుర జట్టుకు కెప్టెన్‌గా బాషా (ప్రకాశం), కోచ్‌గా శ్రీనివాసరావు, మేనేజర్‌గా కె.ప్రభు వరప్రసాద్ వ్యవహరిస్తున్నారన్నారు. ఈ జట్లకు ఆర్జేడీ నాగమణి అభినందనలు తెలిపారు. జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కోరారు. ఖోఖో సంఘ నిర్వహణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు లక్ష మందితో కుంకుమార్చన

- పరిపూర్ణానంద స్వామిజీ



శ్రీపీఠంలో కోటి కుంకుమార్చన వేదికపై నుంచి ప్రసంగిస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: మహిళలు మహాశక్తి యాగాన్ని విజయవంతంగా నడిపిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో సకల జనులకు మంచి జరగాలని కోరుకుంటూ వచ్చే దసరా వేడుకల్లో లక్ష మంది భక్తులతో వంద కోట్ల లలితా కుంకుమార్చనలు ఒకే రోజున నిర్వహిస్తామని పరిపూర్ణానంద స్వామిజీ ప్రకటించారు. స్థానిక రమణయ్యపేటలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగం గురువారంతో 17 రోజులు పూర్తి చేసుకుంది. మహాశక్తి యాగం వేదికపై ఆశీనులైన రమ్యమాతాజీ, దూళిపాళ మహాదేవమణి భక్తులకు ఆధ్యాత్మిక సందేశం ఇచ్చారు. సాయంత్రం కాకినాడకు చెందిన రవితేజ్ గ్రూప్, మల్లిబాబు పేరిణీ శివ తాండవంతో ఆకట్టుకున్నారు. అనంతరం ఆరుద్ర జ్యోతిని స్వామిజీ ప్రజ్వలనం చేసిన తరువాత భక్తులు దీపోత్సవంలో పాల్గొన్నారు. దీపోత్సవంలో కాకినాడ ఎండోమెంట్ డీసీ విజయరాజు పాల్గొని దీపాలు వెలిగించారు. దీపోత్సవ వేదిక నుంచి పరిపూర్ణనంద స్వామి మాట్లాడుతూ మహాశక్తి యాగంలో భాగంగా లలితా కుంకుమార్చనలు 62 లక్షలు పూర్తయ్యాయన్నారు. 50 లక్షల బగళాముఖి జపం, 10 వేల అతిరుద్రం పూర్తయ్యాయన్నారు. దీక్షగా మహిళలు పెద్ద ఎత్తున రావడంతో ఆ అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉంటాయన్నారు. శ్రీ పీఠంలో దసరాలో నాలుగు గంటల పాటు లక్ష మందితో కుంకుమార్చనలు నిర్వహించేందుకు ఇప్పటి నుంచి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.



పేరిణీ శివ తాండవం చేస్తున్న కాకినాడ కళాకారులు

సంక్షేమ సారథికి పట్టం కట్టండి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

- ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పిలుపు
- కాకినాడలో వై ఏపీ నీడ్స్ జగన్

కాకినాడ సిటీ: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక 35వ డివిజన్ సచివాలయం పరిధిలోని సంక్షేమ పథకాల లబ్ధిదారులతో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన ప్రదర్శన ఫలకాన్ని ఎమ్మెల్సీ పద్మశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తప్పుడు వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. డివిజన్‌లో పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి బెండా విష్ణుమూర్తి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

సంక్షేమానికి జగనన్నే కావాలి

కరప: అన్ని సామాజికవర్గాల సంక్షేమానికి, రాష్ట్ర ప్రగతికి దీర్ఘకాలం ముఖ్యమంత్రిగా జగనన్నే కొనసాగాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. మండలం గొర్రిపూడి-1 గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో వారు మాట్లాడారు. అర్హులందరికీ నవరత్న, సంక్షేమ పథకాలు అందిస్తూనే, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అందుకు అనునిత్యం ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని వారు కోరారు. ముందుగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డ్‌ను ఆవిష్కరించారు. సర్పంచ్ కె.రమాదేవి మాట్లాడుతూ గొర్రిపూడి-1 సచివాలయం పరిధిలో రూ.22.6 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు, పుణ్యమంతుల గంగరాజు, ఊబా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ నమోదు వేగవంతం చేయండి

- కమిషనర్ నాగనరసింహారావు
- పీఎంజేఏవైపై ఏఎన్ఎంలకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై)లో భాగంగా అర్హులైన వారందరికీ ఆయుష్మాన్ హెల్త్‌కార్డుల్లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సిబ్బందిని ఆదేశించారు. స్మార్ట్ సిటీ కార్యాలయంలో గురువారం పీఎంజేఏవైపై ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చారు. వలంటీర్ల సహకారంతో ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఆయుష్మాన్ హెల్త్ కార్డులను అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. కార్డులు జారీ అయిన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు ఈకేవైసీ కూడా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై కూడా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అర్హులందరితో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఆయుష్మాన్ హెల్త్‌కార్డు వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడా వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. రూ.5 లక్షల పరిధి కల్గిన వైద్య సేవలతో పాటు ఇతర ప్రయోజనాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

ఘనంగా అన్నకూటోత్సవం



అన్నకూటోత్సవం అనంతరం ప్రత్యేక అలంకరణలో త్ర్యంబకేశ్వరుడు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో శివాలయంలో త్ర్యంబకేశ్వర స్వామికి గురువారం అన్నకూటోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటి నందిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అర్చకులు చైతన్య, పవన్ తదితరులు ఈ ఉత్సవ అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆ ప్రసాదంతో మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. అలాగే నందిబాబు దంపతులు ఆధ్వర్యంలో మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు.

పరశురామునిగా సీతారాముడు



బోట్‌క్లబ్: రజత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు ముగ్గుల పోటీలు



స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ

కాకినాడ క్రైం: ఎయిడ్స్ నియంత్రణ కోసం పాటుపడుతున్న స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో హెచ్ఐవీ వ్యాప్తిపై అవగాహన కల్పిస్తూ ముగ్గుల పోటీలు జరిగాయి. కాకినాడ లోని డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఏపీఎస్‌యూ డీఎల్‌వో రోణంకి రమేష్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఆదిలింగంతో పాటు కార్యక్రమాన్ని నిర్వహించిన వలంటరీ హెల్త్ సర్వీసెస్, చేంజెస్ ప్రతినిధులు, టీజీలు, సెక్స్ వర్కర్లు పాల్గొన్నారు.